ఆ రోడ్డు గుంతలమయం



కంకర తేలిన గొడుగోనిపల్లి-దొంగ ఎన్కేపల్లి బీటీ రోడ్డు

- కంకర తేలిన గొడుగోనిపల్లి-దొంగఎన్కేపల్లి రహదారి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

దోమ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు వేయిస్తున్నామని మాటలు చెప్పడమే కాని ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదని పలుగ్రామాల వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని గొడుగోనిపల్లి గ్రామం నుంచి దొంగ ఎన్కేపల్లి బీటీ రోడ్డు కంకర తేలి అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల కాలంలో వర్షాలు దంచి కొట్టడంతో రోడ్డు మరింత పాడైంది. కంకర తేలి గుంతలు.. గుంతలుగా మారింది. ఈ రోడ్డుగుండా ప్రయాణించే వాహనదారులు, స్థానికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ఈ రహదారి గుండా వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నామని సంబంధిత అధికారులతో మొరపెట్టుకుంటున్నారు. ఐనప్పటికీ ఈ విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. గొడుగోనిపల్లి నుంచి దోర్నాల్ పల్లి, దొంగ ఎన్కేపల్లి చేరుకోవాలంటే దాదాపు 5 కిలో మీటర్ల దూరం ఉంటుందని, ఈ రోడ్డుపై కంకర తేలడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రావాలంటే ప్రధాన రోడ్డు ఒక్కటే ఉండడంతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొంటున్నారు. రోడ్డుపై కంకర ఎక్కువగా ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలూ ఉన్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస మరమ్మతు పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- కార్తీకమాస కార్యక్రమాలను జయప్రదం చేయండి
- వీరశైవ సమాజం సభ్యులు

కొడంగల్ రూరల్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వీరశైవ సమాజం సభ్యులు పేర్కొన్నారు. కార్తీకమాసంలో నిర్వహించనున్న కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని శ్రీనిరంజన మఠంలో నియోజకవర్గ వీరశైవ సమాజం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 19వ తేదీ మంగళవారం బొంరాస్‌పేట చెరువు దగ్గర సాయంత్రం 5గంటలకు శివలింగానికి రుద్రాభిషేకం, కార్తీక దీపారాధన అనంతరం గంగాహారతి నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మాణం చేశారు. నియోజకవర్గంలోని వీరశైవ సమాజం సభ్యులంతా తమ కుటుంబసభ్యులతో హాజరు కావాలని కోరారు. 24వ తేదీన ఆదివారం సందర్శనార్థం కొలనుపాక దర్శించుకుందామన్నారు. ఈ విషయంలో సంఘం సభ్యులు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

పరిగి: స్నేహితురాలు ఆర్థిక ఇబ్బందులతో ఉండటంతో తోటిస్నేహితులు చేయూతనందించారు. మండల పరిధిలోని మిట్టకోడూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 2008–09 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం తోటి స్నేహితురాలు చంద్రకళకు ఆర్థిక సాయం చేశారు. భర్త అకాల మరణం చెందడంతో కుటుంబ పోషణ భారంగా మారడంతో తోటి స్నేహితుల దృష్టికి రావడంతో తమ వంతు సాయంగా రూ. 30,500లను అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడా రు. తమ స్నేహితురాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో తమ వంతు సాయం అందజేశా మన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, మాణిక్యం, వీరప్ప, స్నేహి తులు మహేశ్వరి, జ్యోతి, స్రావంతి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు



జగదీశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. వడ్డర్‌గల్లీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను కొడంగల్ మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి కట్ చేశారు. అభిమానులకు, కార్యకర్తలకు తినిపించారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన అభిమానులు పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ మాజీ ఉప సర్పంచు ఎస్ఎమ్ గౌసన్ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు పట్టణంలోని మహిబూసుభాని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జగదీశ్వర్ రెడ్డి భవిష్యత్‌లో రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ వహీద్ రజా, సయ్యద్ ఇసాక్, అబ్దుల్ జబ్బార్, రహీం, అహ్మద్ ఖాన్, అబ్దుల్ కరీం, మహ్మద్ సిరాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ పండుగను ఘనంగా నిర్వహించాలి

నందిగామ: గ్రామంలో పురాతనమైన దేవాలయం ఉన్న చోటనే నూతనంగా మైసమ్మ ఆలయం మూడునెలల్లో నిర్మించాలని, అనంతరం మూడు ఏళ్లలోపు పండగను ఘనంగా నిర్వహించాలని ఒడుపులమ్మ తల్లి వెల్లడించారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో పలు ఆలయాలతో పాటు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒడుపులమ్మ తల్లి హాజరై పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామం అన్ని రకాలుగా చల్లగా ఉండాలంటే గ్రామ నడిబొడ్డులో గతంలో మైసమ్మ ఆలయం ఉన్న చోటనే మూడు నెలల్లోగా నూతనంగా ఆలయాన్ని నిర్మించాలని చెప్పారు. అనంతరం మూడు ఏళ్లలోపు గ్రామంలో మైసమ్మ పండగను నిర్వహించాలని సూచించారు. అంతకుముందు గ్రామస్తులు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుటుంబ సర్వే



మోమిన్‌పేట: మొరంగపల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రెండో రోజు సమగ్ర కుటుంబ సర్వే కొనసాగింది. ఆదివారం సర్వే అంతంత మాత్రమే నిర్వహించారు. సెలవు రోజు కావడంతో చాల మంది ఎన్యుమరేటర్లు హాజరు కాలేదు. ఒక్కో ఇంటికి సుమారు 50నిమిషాల సమయం పడుతుందని ఎన్యుమరేట్లు చెబుతున్నారు.

దుద్యాల్‌లో..



దుద్యాల్: సర్వేను పరిశీలిస్తున్న సూపర్ వైజర్ విజయరామారావు

దుద్యాల్: కుల గణనకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూపర్‌వైజర్, దుద్యాల్ మండల విద్యాధికారి విజయరామారావు పేర్కొన్నారు. ఆదివారం దుద్యాల్‌లో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వేలో దాదాపుగా 56 ప్రధాన ప్రశ్నలతో పాటు మరో 20 వరకు ఉప ప్రశ్నలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఆస్తుల వివరాలు, ఉద్యోగ వివరాలు ఉండడంతో చాలా మంది ఆగ్రహానికి గురవుతున్నారన్నారు. కుటుంబ వివరాల నమోదుకు ప్రజలు ఎన్యుమరేటర్లకు సహకరించాలి ఆయన సూచించారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నందిగామ: మండల పరిధిలోని చేగూరు, మేకగూడ పీఏసీఎస్‌లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మండల వ్యవసాయాధికారి వాణిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రాన్ని రైతాంగం సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని వారు విజ్ఞప్తి చేశారు.

సంచార జాతులపై వివక్ష తగదు

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వానికి సంచార జాతి కులాలపై వివక్ష తగదని సంచార జాతుల సంఘం నాయకుడు బైలు కమ్మర మోహన్‌చవాన్ అన్నారు. ఆదివారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ఫారంలోని 45వ ప్రశ్నను(సంచార జాతి కులం) ఎందుకు తొలగించారని ఆయన ప్రశ్నించారు. సంచార జాతి అనే చులకన భావంతోనే తొలగించారని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని అధికారులకు సంచార జాతి ప్రజలేవరో తెలియదు. ఇప్పటికైనా ఎవరో అని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి స్వాగతం

ఆమనగల్లు: లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల నాయకులు ఆదివారం నగరంలోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బాబా, సింగిల్ విండో డైరెక్టర్ జగన్, రమేష్ గౌడ్, విజయ్ రాథోడ్, శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

షాబాద్: దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని మల్లన్న దేవాలయ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, దోనూరు గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ పురాతన మల్లన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న దేవాలయానికి తనవంతు ఆర్థిక సహాయంగా నందిగామ మండలం బండోనిగూడ గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బండ అశోక్ రూ.9లక్షల రూపాయల విరాళంను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. పురాతన దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో ఇంత పెద్దగా దేవాలయాలు నిర్మిండం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు శంకరయ్య, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దుద్యాల్: ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–1990 బ్యాచ్ విద్యార్థులు 34 సంవత్సరాల తరువాత ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు పలకరించుకున్నారు. కుటుంబ వివరాలు, యోగక్షేమాలు తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. వీరికి బోధించిన ఉపాధ్యాయులు రాంరెడ్డి, జగదీశ్ కుమార్, గౌడ్, దశరథ్, చంద్రశేఖర్‌లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కిషన్ జీ, బి కృష్ణ, విజయ్, సదాశివలింగం, సి కృష్ణ, శాంత, సుచరిత, ఉమాదేవి, ప్రభావతి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాండూరు టౌన్‌లో..

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని కన్యా బాలికల పాఠశాలలో 2001–02వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయినులు సత్యమ్మ, మాధురి, జ్యోతిలను శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలనాటి జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు గాజుల మాధవి, గాండ్ల ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థినులు



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే కృషి

డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్

పరిగి: ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని కొడంగల్ చౌరస్తా నుంచి సయ్యాద్‌మల్కాపూర్ వరకు బీటీ రోడ్డు గుంతలమయంగా మారడంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. దీనికి సంబంధించిన నిధులు విడుదల చేయించి ఆదివారం బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంతుముదిరాజ్ మాట్లాడారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకున్న అభివృద్ధి పనులు మాత్రం నిరంతరం కొనసాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో పూర్తిగా పాడైన రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరిన ఎవరూ పట్టించుకోలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ అంటేనే ప్రజా ప్రభుత్వం అని ప్రజల శ్రేయస్సు కోసం పని చేసే ఏకైక పార్టీనని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటిని నెరవేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, ఆనెం ఆంజనేయులు, అక్బర్, జగన్, రామకృష్ణారెడ్డి, గోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలి



నూతన సభ్యులతో సంఘం ప్రతినిధులు

కొడంగల్: మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో పురోగతి సాధించేందుకు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని మహాదేవుని ఆలయ ఆవరణలో ఆదివారం మున్నూరు కాపు యువక మండలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ప్రతినిధులు బాకారం చంద్రశేఖర్, బాకారం మల్లయ్య, అరిగె ఓం ప్రకాశ్, కానుకుర్తి నర్సిరెడ్డి, బొంకురు నరేష్ పటేల్, సిరుసని శ్యాంసుందర్ సమక్షంలో ఎన్నుకున్నారు. సంఘం యువక మండలి మండల గౌరవ అధ్యక్షుడిగా బాకారం చంద్రశేఖర్, అధ్యక్షుడిగా కానుకుర్తి హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బాసకారి శ్రీనివాస్(పర్సాపూర్), తూము సురేష్, గూటం రమేష్, ప్రధాన కార్యదర్శిగా బాకారం అరుణ్ కుమార్, కార్యదర్శిగా బొంకురు అరవింద్, సహాయ కార్యదర్శిగా బొంకురు బాలకృష్ణ, కోశాధికారిగా కానుకుర్తి మణికంఠ, ప్రచార కార్యదర్శిగా కానుకుర్తి సతీష్‌లతోపాటు మరో 13మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడారు. నియోజకవర్గంలో గ్రామ, మండల, యూత్, మహిళా సంఘం కమిటీలను నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కానుకుర్తి పెద్ద రాములు, కానుకుర్తి శేఖర్, పాండు, ఉడిమేశ్వరం శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డిపల్లి నర్సిములు, బొంకురు కృష్ణ, బాకారం శేఖర్, రాజు, రాజశేఖర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవమైనది



ఎంఈఓ కిష్టారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు ఎంఈఓగా పనిచేస్తూ శంషాబాద్ బదిలీపై వెళ్లిన కిష్టారెడ్డికి కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల పీఆర్టీయూ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో గురువులకు ఒక ప్రత్యేక గౌరవమున్నదని, ఒక విద్యార్థి ఎంతో గొప్ప స్థానంలో ఉన్న తనకు విద్య నేర్పిన గురువుకు ప్రత్యేక గౌరవం ఇస్తాడని గుర్తుచేశారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలతో పాటు షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ, కొత్తూర్ మండలాలకు సైతం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ ప్రభుత్వ పాఠశాలలను ఒక చక్కని దిశగా నడిపించిన నైపుణ్యం గల వ్యక్తి కిష్టారెడ్డి అన్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా విద్యార్థులకు మంచి సేవలందించి, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొందుర్గు ఎంపీటీసీ గాయత్రి, జిల్లేడ్ కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు నాజర్‌అలీ, వంశీధర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేశ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, గోపీనాథ్, సునిత, చెన్నారెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుకు భరోసా ఏదీ?



యాసంగి సాగుకు సమాయత్తం

- పెట్టుబడి సాయం ఊసెత్తని సర్కారు
- ఆందోళనలో అన్నదాతలు

షాబాద్: వానాకాలం సీజన్ ముగిసింది. యాసంగి వచ్చింది. అయినా ప్రభుత్వం రైతు భరోసాపై స్పష్టత ఇవ్వడం లేదు. కనీసం ఈ సీజన్‌లోనూ పెట్టుబడి సాయం అందుతుందా... అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మండలంలో సుమారు 58 వేల ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా ప్రతి సంవత్సరం 35 వేల నుంచి 40 వేల పైచిలుకు ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. కాగా గత ప్రభుత్వం 2018 వానాకాలం నుంచి 2023 యాసంగి వరకు వరుసగా 12 సార్లు పెట్టుబడి సాయం అందించింది. సీజన్ ఆరంభానికి ముందే రైతుబంధు ఇవ్వడంతో సకాలంలో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకొని పంటలు సాగు చేశారు. 2018 వానాకాలంలో పథకాన్ని ప్రారంభించి 2018 వరకు ఎకరాకు రూ.4వేల చొప్పున, ఏడాదికి రూ.8 వేల పెట్టుబడి సాయం అందించారు. అయితే 2019 వానాకాం సీజన్ నుంచి ఎకరాకు రూ.వేల చొప్పున ఏడాదికి ఎకరాకు రూ. 10వేలు అందించారు. 2023 యాసంగి వరకు గత ప్రభుత్వం మండలానికి రూ. 2కోట్ల రూపాయల వరకు రైతుబంధు రైపంలో రైతులకు అందజేసింది. చివరగా 2023 యాసంగిలోనూ మండలానికి 26 వేల మంది రైతులకు 45 వేల ఎకరాల భూమికి రూ 1.50 కోట్ల పెట్టుబడి సాయం ఇచ్చింది.

స్పష్టత కరువు

గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి రాగానే రైతు భరోసా ఎకరాకు రూ.7,500 చొప్పున, ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పారు. కాగా అధికారంలోకి వచ్చి సుమారు 11 నెలలు కావొస్తున్నా పెట్టుబడి సాయంపై స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికే వానాకాలం సీజన్ గడిచిపోయింది. యాసంగి సీజన్ రానే వచ్చింది. వ్యవసాయశాఖ అధికారులు సాగు అంచనా సైతం ఖరారు చేశారు. కానీ పెట్టుబడి సాయానికి సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వానాకాలం సీజన్‌లో ఎలాగు ఇవ్వలేదు. కనీసం ఈ యాసంగికైనా పెట్టుబడి సాయం అందుతుందా అంటూ రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గందరగోళంలో రుణమాఫీ

మండలంలో రుణమాఫీ గందరగోళంగా మారింది. ఏ ప్రాతిపదికన రుణమాఫీ ఇచ్చారో అర్థంకానీ పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ అన్నారు. కానీ లేనిపోని సాకులు చూపుతూ అనేక మంది రైతులకు మాఫీ చేయలేదు. తెల్లరేషన్ కార్డు లేనివారికి అధికారులు కుటుంబ నిర్ధారణ చేశారు. కానీ ఇప్పటికీ వారి ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేయలేదు. అలాగే కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు సైతం మాఫీ చేసినా ప్రభుత్వం మరికొంత మందికి చేయలేదు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగి తల్లిదండ్రులకు సైతం రుణమాఫీ కాలేదు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే తమకు ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. బ్యాంకర్ల నుంచి ప్రభుత్వం నేరుగా డేటా తీసుకుందని అంటున్నారు. అలాగే రైతుభరోసా సైతం ఏ ప్రాతిపదికన ఇస్తారనేది ఇప్పటి వరకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

రైతుభరోసా అందజేయాలి



ప్రభుత్వం రైతులను ఆర్థిక సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతులకు రైతు భరోసా అందజేయాలి. గత ప్రభుత్వంలో ప్రతీ సంవత్సరం రెండుసార్లు రూ.10వేలు అందజేసింది. ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. ఇప్పటి వరకు ఇవ్వలేదు. దీంతో రైతులు పంటల సాగు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

– మహేందర్‌రెడ్డి, రైతు, పోలారం, షాబాద్